ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం

వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మామిళ్లగూడెం, జనవరి 20 : ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో అరుణ, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లా సెక్రటరీకి న్యాయవాదుల వినతి

ఖమ్మం లీగల్, జనవరి 20 : న్యాయవాద రక్షణ చట్టంలో సవరణలు చేయడం శుభపరిణామమని టీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు తాళ్ళూరి దిలీప్ చౌదరి, పసుపులేటి శ్రీనివాసరావు అన్నారు. న్యాయవాద రక్షణ చట్టంలో మార్పుల కోసం లా డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా సలహాలు, సూచనలు కోరడంతో లా సెక్రటరీని కలిసి వారు సోమవారం వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులపై దాడి చేస్తే 5 నుంచి 7ఏళ్ల వరకు శిక్షను పెంచాలని, రెండోసారి దాడి చేస్తే 7 నుంచి 10సంవత్సరాలకు శిక్షను పెంచాలని వినతిప్రతంలో కోరారు.

బాధ్యతలు చేపట్టిన ఖమ్మం ఏఎంసీ నూతన పాలకవర్గం

ఖమ్మం వ్యవసాయం, జనవరి 20: నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఎట్టకేలకు బాధ్యతలు చేపట్టింది. సోమవారం మార్కెట్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో చైర్మన్‌గా యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్‌గా తల్లాడ రమేష్‌తోపాటు మరో 14మందితో కూడిన పాలకవర్గం సభ్యులు బాధ్యతలు చేపట్టారు. నగర మేయర్ పీ నీరజ, నాయకులు పువ్వాళ్ల ఉదర్గాప్రసాద్, జావిద్, చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, జీవై నరేష్, మన్నెం కృష్ణ, దిరిశాల వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు.

216 కిలోల గంజాయి దహనం

మామిళ్లగూడెం/సత్తుపల్లి, జనవరి 20: ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పట్టబడిన 216 కిలోల గంజాయిని పోలీస్ అధికారులు సోమవారం దహనం చేశారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని శాస్త్రీయ పద్ధతిలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్సు ఏసీపీ రవి పర్యవేక్షణలో దహనం చేశారు. గంజాయి దహనాన్ని జిల్లాలోని తల్లాడ మండలంలోని గోపాల్‌పేట గ్రామంలో ఉన్న ఏడబ్ల్యూఎం కన్సల్టెన్సి బయో వేస్టేజ్ బర్నింగ్ ప్లాంట్‌లో నిర్వహించారు.

మున్సిపాల్ సాధారణ సమావేశం రసాభాసా

వైరాటౌన్, జనవరి 20: వైరా మున్సిపాలిటీ సాధారణ సమావేశం రసాభాసాగా సాగింది. సోమవారం స్థానిక మున్సిపాల్ కార్యాలయంలో మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్ ఆధ్వర్యంలో సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైరా శాసనసభ్యులు రాందాస్‌నాయక్ హాజరయ్యారు. రెండో వార్డు కౌన్సిలర్ బత్తుల గీత మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్ తీరుపై ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు.

రేషన్‌కార్డుల మంజూరు సర్వేను పరిశీలించిన డీపీవో

బోనకల్లు, జనవరి 20: మండలంలోని ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం గ్రామాల్లో రేషన్‌కార్డుల మంజూరు సర్వేను సోమవారం మధిర నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.ఎ.ఎస్.పీ.ఆశాలత పరిశీలించారు. అధికారులకు రేషన్‌కార్డుల సర్వే ప్రక్రియపై సూచనలు చేశారు. సాయంత్రం వరకు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కడాల విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో ఆర్.రమాదేవి, ఎంపీవో వీ.వీ.ఎస్.శాస్త్రి, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి రైతులకు ధరాఘాతం

మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 20 : సరిగ్గా పంట చేతికి వచ్చే సమయంలో మిర్చి పంటల ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో ఎన్నో ఆశలు, ఆశయాలు పెట్టుకొని పంట ఉత్పత్తి చేసి మార్కెట్‌కు తీసుకవచ్చిన రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. మార్కెట్‌లో అన్‌సీజన్ సమయంలో అటు కొత్తపంటకు, ఇటు ఏసీరకం పంటకు సైతం మంచి ధరలు పలికాయి. గత ఏడాది సైతం పంట చేతికి వచ్చే సమయంలో క్వింటాల్ రూ.20 వేలకు పలికింది. అయితే రానున్న రోజుల్లో మరింత ధర పలుకుతుందని భావించిన వ్యాపారులు, కొందరు రైతులు పంటను కోల్డ్ స్టోరేజీలలో నిల్వ పెట్టుకోవడం జరిగింది. సరిగ్గా ఆరు నెలలు తిరగకముందే ప్రస్తుతం కొత్త, ఏసీ రకం పంటలకు ధరలు రికార్డు స్థాయిలో పడిపోతున్నాయి. సాగుకు భారీగా పెట్టుబడి పెట్టిన రైతులు మార్కెట్లో ధరను చూసి తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. సోమవారం నగర వ్యవసాయ మార్కెట్‌కు జిల్లా రైతులతో పాటు పొరుగు జిల్లాల నుంచి రికార్డుస్థాయిలో 30వేల బస్తాలను మిర్చిమర్కెట్‌కు తీసుకొచ్చారు. అనంతరం జరిగిన జెండాపాటలో కొత్తరకం పంటకు క్వింటాల్ రూ.15,300 పలికింది. మధ్య ధర రూ.14 వేలు కాగా, కనిష్ట ధర రూ.4,700గా నిర్ణయించి వ్యాపారులు పంటను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.15 వేలు జెండాపాట పలికినప్పటికి మెజారిటీ లాట్‌లు రూ.13-14వేలకు మాత్రమే అమ్ముడుపోయాయి. ధర తగ్గే అవకాశం ఉందనే వార్తలు వస్తుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం మిర్చి రైతులకు సైతం బోనస్ ఇచ్చి ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **చెల్లా చిన్ని, W/o. శ్రీను, వయస్సు:** 27సం॥లు, **వృత్తి:** గృహిణి నివాసం: ఇ.నెం. 4-96, అన్నపురెడ్డిపల్లి గ్రామం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా, కల్లూరు సబ్‌జిస్ట్రార్‌వారి అధికార పరిధిలోని, ఖమ్మం జిల్లా, కల్లూరు రెవిన్యూ మండల పరిధిలోని, కల్లూరు గ్రామ పంచాయితీ ఏరియాలోని, కల్లూరు రెవిన్యూ రికార్డు దాఖలా 3-267 నెంబరు గల ఇంటికి సంబంధించిన ఖాళీ నివేశన స్థలము విస్తీర్ణం. 311-00 చ॥గజముల స్థలము లేదా 260.03 చ॥మీటర్లు, **డాక్యుమెంట్ నెం: 2120/2024,** ఖాళీ నివేశన స్థలమునకు సరిహద్దులు : **తూర్పు:** 9 అడుగుల వెడల్పు గల రోడ్డు, **పడమర:** నా స్వంత స్థలము, **ఉత్తరము :** కల్లూరు టు పుల్లయ్య బంజర పోవు రోడ్డు, **దక్షిణము** : మంగల వెంకటేశ్వర్లు గారి స్థలము.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

లయన్స్‌క్లబ్ భవనంలో టైలరింగ్ శిక్షణ

ఖమ్మం సిటీ, జనవరి 20 : ఖమ్మం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని యువతులకు టైలరింగ్ శిక్షణ ఏర్పాటు చేశారు. సోమవారం నగరంలోని సంస్థ భవనంలో కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రాన్ని ఖమ్మం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలో తమ సంస్థ అన్ని వేళలా ముందుంటుందన్నారు. ఇప్పటికే అనేక రకాలుగా సేవలు అందిస్తున్నామని, భవిష్యత్తులోనూ ఇదే ఒరవడిని కొనసాగిస్తామన్నారు. డాక్టర్ రాఘవరెడ్డి, విశ్వేశ్వరరావు, దుర్గా నాగేశ్వరరావు, వెంకయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రూ.91 లక్షలకు ఐపీ

ఖమ్మం లీగల్, జనవరి 20: తిరుమలాయపాలెం మండలం పాపాయిగూడెం గ్రామానికి చెందిన పంచకర్ల వీరాంజనేయులు, పంచకర్ల దుర్గాప్రసన్న రూ.91 లక్షల 30వేలకు దివాళా పిటిషన్ దాఖలు చేశారు. దివాళ పిటిషన్‌లోని వివరాల ప్రకారం ఫిర్యాదిదారులు ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేసేవారు వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి అధిక వడ్డీలకు అప్పులు చేశారు. వ్యాపారంలో నష్టం రావడం, రుణదాతల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో దివాళ పిటిషన్ దాఖలు చేసినట్లు కోర్టుకు తెలిపారు. 51మంది రుణదాతలను ప్రతివాదులుగా పేర్కొంటూ ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాళా పిటిషన్ దాఖలు చేశారు. దివాళ పిటిషన్‌దారుల తరపున న్యాయవాదులుగా మువ్వా నాగేశ్వరరావు, దేవకి శ్రీనివాసరావుగుప్తా, నోముల వాసవిదేవి వ్యవహరిస్తున్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్ట్రర్ తనఖా చేయించుకొని **సన్నపు సుధాకర్** S/o. కోటయ్య, **వయస్సు:**39సం॥లు, **వృత్తి:**వ్యవసాయం, నివాసం: ఇ.నెం.3-1,తల్లాడ గ్రామము, తల్లాడ మండలం,ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా అశ్వారావుపేట రిజిస్ట్రారు మరియు ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రారు వారి అధికార పరిధిలోని ఖమ్మం జిల్లా ప్రజాపరిషత్, ఖమ్మం రూరల్ రెవిన్యూ మండలం,యం.వెంకటాయపాలెం గ్రామపంచాయితీ పరిధిలోని యం.వెంకటాయపాలెం రెవిన్యూ సర్వే నెంబర్లు : 93/ఆ, 93/ఇ, 94/ఆ, 94/ఇ, 94/ఉ, 95/ఆ1, 95/ఆ, 95/ఆ2, 95/ఆ3, 95/ఆ4 ల్యాండ్ కన్వర్షన్ ప్రకారం సర్వే నెం. 95/2, 95/3, 93/2,94/4,95/6, 94/3, 95/5, 94/2,95/4 మిం.లే.నివేశన ఖాళీ స్థలము ప్లాటు నెం.109, **డాక్యుమెంట్ నెం: 3310/2021,**విస్తీర్ణము :166-66 చ॥గ॥ = 139-34 చ॥మీ॥ గల స్థిరాస్తినవ హద్దులు :**తూర్పు:** 30 అడుగుల రోడ్డు, **పడమర:** ప్లాటు నెం. 121, **ఉత్తరము :** ప్లాటు నెం. 108, **దక్షిణము** : ప్లాటు నెం. 110.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

అక్రమ కూల్చివేతలను అడ్డుకుంటాం

బాధితులకు అండగా నిలుస్తాం.. బీఆర్ఎస్ ఖమ్మం నగర నాయకులు, కార్పొరేటర్లు

బాధితులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర నాయకులు, కార్పొరేటర్లు

ఖమ్మం, జనవరి 20: పేదలకు నష్టం కలిగించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని, ఖమ్మం నగరంలో అక్రమ కూల్చివేతలను అడ్డుకొని తీరతామని బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు అన్నారు. నగరంలోని 30వ డివిజన్ సుందరయ్యనగర్‌లో గల పేదల ఇండ్లకు 80అడుగుల వరకు మార్కింగ్ పెట్టి వెంటనే ఇండ్లు ఖాళీ చేయాలని, లేకపోతే కూల్చివేస్తామని మున్సిపల్ అదికారులు పేద ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఈ విషయం తెలుసుకుని సోమవారం బీఆర్ఎస్ నగర నాయకులు ఆ ప్రాంతంలోని ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పగడాల నాగరాజు, బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ కర్నాటి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినప్పటికీ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. ప్రజలకు అవసరం ఉన్న చోట రోడ్డు వేయాలని తప్ప వారికి అవసరం లేని చోట వేసి నష్టం వాటిల్లే విధంగా చర్యలు తీసుకోవద్దన్నారు. ఈ విషయంలో స్థానిక ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. గతంలో ఖమ్మం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మురికికూపంగా ఉన్న ఈ ప్రాంతాన్ని వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసి, ఆహ్లాదకరంగా పార్కులను తీర్చిదిద్ది ఒక మంచి వాతావరణాన్ని ఏర్పాటు చేశారన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఈ విధంగా ఇండ్లకు మార్కింగ్ చేసి ఇండ్లని కూలగొట్టాలని చూడడం హేయమైన చర్య అన్నారు. మంత్రి తుమ్మల తక్షణమే స్పందించి రోడ్డు సమస్యని పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కార్పొరేటర్ ముక్కల కమల, మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ షేక్ మక్బుల్, కార్పొరేటర్లు రుద్రగాని శ్రీదేవి, తోట ఉమారాణి, పసుమర్తి రామ్మోహన్, బుడిగం శ్రీనివాస్, మాటేటి అరుణ, మోతారపు శ్రావణి, కూరాకుల వలరాజు, డోన్‌వాన్ సరస్వతి, పల్లా రోసిలీనా, పగడాల శ్రీవిద్య, దాదే అమృత, నాయకులు మాటేటి కిరణ్, రాజేష్, మధు, నరేష్, నాగరాజు, రాధ, నాగేందర్‌బాబు, గోపి, సతీష్, వెంకటేష్, గోపాల్, క్రాంతి, అజయ్, నవీన్, నరేష్, చంద్రశేఖర్, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

వెంకటనర్సయ్యకు ఘనంగా నివాళి

వెంకటనర్సయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న తాతా మధు, సండ్ర


నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ నామా, సినీ నటుడు వేణు

ఖమ్మం, జనవరి 20: ఖమ్మం పార్లమెంట్ మాజీ సభ్యుడు నామా నాగేశ్వరరావు మేనమామ మారెడ్డి వెంకటనర్సయ్యకు కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు సోమవారం ఘనంగా నివాళి అర్పించారు. సోమవారం ఖమ్మం నగరంలో జరిగిన సంస్మరణ సభలో వెంకటనర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, లింగాల కమల్‌రాజు, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, చిన్నమ్మ, భవ్యతేజ, రామారావు, సాయిరాం, సీతయ్య, తరుణ్, కృష్ణయ్య, ధనమ్మ, కుమారుడు శ్రీను, రవి, తులసమ్మ, సీతారామయ్య, నాగేశ్వరరావు, సినీనటుడు తొట్టెంపూడి వేణు, బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడికి నిరసన

కొణిజర్ల, జనవరి 20: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కంబాలపల్లి రాములుపై పాఠశాల ఆవరణలో దాడి చేసి విధులకు ఆటంకం కలిగించిన దుండగులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

తిరుమలాయపాలెం, జనవరి 20: తుక్కుగూడ ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడికి నిరసనగా తిరుమలాయపాలెంలో ఉపాధ్యాయులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

పెనుబల్లి, జనవరి 20: ప్రధానోపాధ్యాయుడు కంబాలపల్లి రాములుపై పాఠశాల ఆవరణలో దాడి చేసి విధులకు ఆటంకం కలిగించిన దుండగులపై చర్యలు తీసుకోవాలని నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు.

వేంసూరు, జనవరి 20: మండలంలోని పలుపాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎర్రుపాలెం, జనవరి 20:రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గేజిటెడ్ హెచ్ఎం కంబాలపల్లి రాములుపై దాడి చేసిన సంఘటనకు నిరసనగా సోమవారం ఎర్రుపాలెం మండలంలోని అన్ని పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో భోజన విరామ సయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

రెండుతలల ఆవుదూడ జననం

రెండు తలల ఆవుదూడ

ఖమ్మం రూరల్, జనవరి 20 : మండలంలోని చింతపల్లి గ్రామంలో సోమవారం విచిత్రమైన ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని మేకపోతుల పెద్ద పరమయ్యకు చెందిన ఆవుకు రెండు తలలు కలిగిన ఆవుదూడ జన్మించింది. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్దఎత్తున దూడను చూసేందుకు తరలివచ్చారు. అయితే కొద్ది సేపటికే దూడ మరణించడంతో యజమానితోపాటు, గ్రామస్తులు ఆవేదనకు లోనయ్యారు.

టెన్త్‌కు 96, ఇంటర్‌కు 72

పరీక్షా కేంద్రాల ఎంపిక పూర్తి

మార్చి 5 నుంచి ఇంటర్, మార్చి 21 నుంచి టెన్త్ పరీక్షలు

ఖమ్మం అర్బన్, జనవరి 20 : విద్యార్థి దశలో కీలకంగా భావించే ఇంటర్మీడియట్, పదో తరగతి వార్షిక పరీక్షలకు ప్రభుత్వం నగరా మోగించింది. పరీక్షల తేదీలు ప్రకటించడంతో చదువుపై ఇప్పటివరకు తేలిగ్గా తీసుకున్న విద్యార్థుల్లో ఒక్కసారిగా కదలిక వచ్చింది. మరోవైపు సైన్స్ గ్రూప్‌ల విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉండనే ఉన్నాయి. పరీక్షల నిర్వహణలో కీలకమైన పరీక్ష కేంద్రాల ఎంపిక పూర్తయింది. జిల్లాలో టెన్త్‌కి 96 కేంద్రాలు, ఇంటర్‌కు 72 కేంద్రాలను ఎంపిక చేశారు. మార్చి 5న ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు, 6వ తేదీ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇవి మార్చి 25వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు 20వ తేదీతో ముగుస్తాయి. రాష్ట్రంలో విద్యాసంవత్సరానికిగాను మొదట ప్రారంభమయ్యే పరీక్షలివే. ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, రెసిడెన్షియల్, సంక్షేమ కళాశాలలు మొత్తం కలిపి 128 కళాశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ప్రథమ సంవత్సరం జనరల్‌లో 15,579 మంది, ఒకేషనల్‌లో 2,204 మంది మొత్తం 17,783 మంది హాజరుకానున్నారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్‌లో 16,632 మంది, ఒకేషనల్‌లో 2,245 మంది మొత్తం 18,877మంది హాజరుకానున్నారు. ప్రథమ, ద్వితీయ కలిపి 36,660 మంది విద్యార్థులు హాజరుకానుండగా వీరికోసం 72 కేంద్రాలను ఎంపిక చేశారు.

మార్చి 21 నుంచి టెన్త్ పరీక్షలు

మార్చి 21వ తేది నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా నుంచి 16వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 21వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. బాలురు 8,358 మంది, బాలికలు 8,058 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. 96 కేంద్రాలు రెగ్యులర్‌వి, ఒకటి ప్రైవేట్ కేంద్రం ఎంపిక చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

ఎర్రుపాలెం, జనవరి 20: మండల పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు యరమల కృష్ణారెడ్డికి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కృషితో మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.60 వేల చెక్కును సోమవారం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి సోమవారం ఖమ్మం పార్టీ కార్యాలయంలో అందజేశారు. కట్టా అజయ్‌బాబు, శీలం నారాయణరెడ్డి, సింహాద్రి, వెంకటేశ్వరరావు, బొర్రా నరసింహారావు, కాళేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట

మధిర, జనవరి 20: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చిలుకూరు, ఖమ్మంపాడు గ్రామాల్లో సోమవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ ఎస్.మైథిలి మాట్లాడుతూ.. రైతులకు విద్యుత్ వినియోగించు సమయంలో ప్రమాదాల బారిన పడకుండా తప్పనిసరిగా కెపాసిటర్లు అమర్చుకోవాలన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, లైన్‌మెన్ వెంకటేశ్వరరావు, ఏఎల్ఎం నాగరాజు, ప్రకాశ్‌రావు, నిడమానూరి నరసింహారావు రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై సోషల్ ఆడిట్

ముదిగొండ, జనవరి 20: మండల పరిధిలోని పమ్మి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పై సోమవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్, రోజువారీ మెనూ వంటి అంశాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రత, వంట ప్రదేశంలో పరిశుభ్రతను పరిశీలించారు. పరిశుభ్రమైన ప్రదేశంలో నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

మలేరియా పట్ల జాగ్రత్తగా ఉండాలి

ముదిగొండ, జనవరి 20: మలేరియాపై జాగ్రత్తగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డా. వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మలేరియా నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి ఫైలేరియా కేసుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రేపటి నుంచి జేఈఈ మెయిన్స్

ఖమ్మం అర్బన్, జనవరి 20 : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించే జేఈఈ మెయిన్స్, బీఆర్క్ పరీక్షలు ఈ నెల 22వ తేదీ ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల కోసం జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా(జేఈఈ) జాయింట్ ఎంట్రన్స్ టెస్ట్ జరగనుంది. జేఈఈ ఎంట్రన్స్‌ను రెండు సెషన్స్‌లో నిర్వహిస్తున్నారు. మొదటి సెషన్‌లో పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరగనుంది. మధ్యాహ్నం సెషన్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని పరీక్షల కో-ఆర్డినేటర్ రామసహాయం పార్వతీరెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరగనుంది. బొమ్మ ఇంజినీరింగ్ కళాశాల, ఎస్‌బీ ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, విజయ ఇంజినీరింగ్ కళాశాల, దరిపల్లి అనంతరాములు ఇంజినీరింగ్ కళాశాల, ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 22వ తేదీ నుంచి 23, 24, 28, 29వ తేదీల్లో మెయిన్స్, 30వ తేదీన బీఆర్క్ పరీక్ష నిర్వహించనున్నారు.

గ్రామసభలు ప్రశాంతంగా జరపాలి

పెనుబల్లి, జనవరి 20: మంగళవారం నుంచి జరిగే గ్రామసభలు పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో జరగాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ అన్నారు. సోమవారం పెనుబల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావే